ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
6
సోమవారం 11 మార్చి 2024



తవ్వడం.. తరలించడం..



చారిగాం సమీపంలో తవ్వకాలు జరపడంతో కరిగిపోయిన గుట్ట

- కనుమరుగవుతున్న గుట్టలు
- మట్టి, మొరం కోసం గుట్టలు మాయం..
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: కాగజ్‌నగర్ మండలంలో మట్టి, మొరం కోసం అక్రమార్కులు యథేచ్ఛగా గుట్టలు, భూములు తవ్వేస్తూ కోట్లాది రూపాయల దందా కొనసాగిస్తున్నారు. రూపాయలు కోట్లు విలువైన సంపదను అప్పనంగా దోచేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటు మైనింగ్‌శాఖ, అటు రెవెన్యూ శాఖాధికారులు తెలిసీతెలియనట్లు ఉండడంతో భారీఎత్తున అక్ర మాలు తవ్వకాలు సాగిస్తున్నారు. మండలంలోని చారిగాం, బోరిగాం, త్రిశూల్‌పహాడ్ గుట్ట, వల్లకొండ, చింతగూడ, తదితర ప్రాంతాల్లో మొరం, కంకర, మట్టిని జేసీబీల సహాయంతో తవ్వుతూ తరలిస్తున్నారు. ఈ దందాతో గుట్టలు కరిగిపోతున్నాయి. ఆయాప్రాంతాల్లో ఉన్న పెద్దపెద్ద చెట్లు నేల వాలుతున్నాయి.

అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల్లోనూ..

ఒకవైపు అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు ఎక రాల్లో తవ్వుతూ మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా మట్టి, మొరం తవ్వుకొని స్థానికంగా వెంచర్లు, ప్లాట్లు, ఇతరస్థలాల యజమానులకు అమ్ముకుంటున్నారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. ఈ మట్టి, మొరం తవ్వకాలు చేపట్టే స్థలాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నీరు నిలిచి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఏర్పడుతోంది. దీంతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. ఎలాంటి లీజు, రాయల్టీలు చెల్లించకుండానే దందా కొనసాగిస్తున్నారు. దీంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతోంది. గుట్టలు కనిపిస్తే భారీ యంత్రాలు వినియోగించి మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిద్ర నటిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా పెద్ద ఎత్తున తవ్వకాలు జరుపుతుండడంపై ఆయా గ్రామాల వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం సాగిస్తున్నా కూడా ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదంటే ఆశ్చర్యం కలుగకమానదు. రాత్రి, పగలు, సెలవు దినాల్లోనూ దందా పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారనే ఆరోపలున్నాయి. వ్యవసాయ భూముల్లో అడ్డగోలు వెంచర్లు వెలుస్తుండడం వాటికి మొరం, మట్టి తరలించి ఈ అక్రమ దందాను చేపడుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమార్కులు ఈ దందా కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ, అసైన్డ్ భూములనుంచి మట్టి, మొరం అక్రమంగా తరలిస్తున్న కొంత మంది వ్యాపారులు చింతగూడ, బలగల చారిగాం, బోరిగాం, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పెద్దఎత్తున గుట్టలు మాయం చేశారు. కొన్ని ప్రాంతాల్లోనైతే శ్మశాన వాటికలు, ఇతర స్థలాల్లోనూ యంత్రాలు ఉపయోగించి తవ్వకాలు జరిపించడం చూస్తే ఏమేరకు అక్రమ దందా కొనసాగుతుందనేది నిర్ధారణ అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈవిషయమై కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను సంప్రదించగా తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుంటామన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన కోనప్ప



డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి పలు అంశాలపై చర్చించారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



అగ్నిగుండంలో నడుస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

పెంచికలపేట, మార్చి 10: మహాశివ రాత్రి సందర్భంగా మండలంలోని ఎల్లూరు గ్రామంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన జాతరలో ఆదివారం స్వామివారిని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి ప్రభలఉత్సవం, అగ్నిగుండాల ప్రవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, మధుకర్, నగేష్, ప్రభాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్, మార్చి 10: మండలంలోని రౌటసంకెపల్లి గ్రామంలో పర్శనంబాల- బారెగూడలోని ఆదివారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ రూ.15 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు పంచాయతీ పరిధిలోని అన్నిగ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణపనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని కోత్మీర్, గొర్రెగుట్ట, దహెగాం గ్రామాల్లో ఆదివారం సీసీరోడ్ల నిర్మాణానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మండలంలో రూ.2కోట్లతో ఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ్, సత్యనారాయణ, వెంకటేశం, నారాయణ, రమేష్, తిరుపతిగౌడ్, మల్లేష్, సంజీవ్, సురేష్‌గౌడ్, మల్లేష్, సత్యనారాయణ, మహేష్, వెంకటేష్, సుధాకర్, మతీన్, భాషు, నిజాం తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: హెల్త్ సబ్‌సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని చింతగూడ, ఎల్‌డబ్లూ సెంటర్, చారిగాం, బట్టుపల్లి గ్రామాల్లో హెల్త్‌సెంటర్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్‌కార్యక్రమం నిధులురూ.20లక్షలతో ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖకు మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు క్రిష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, గజ్జల లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: కాగజ్‌నగర్ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా బొజ్జ పద్మాకర్, ప్రధానకార్యదర్శిగా పోలోజు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వెంకటేశ్వర, బ్రహ్మంగారి ఆలయంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాంచాలపు లక్ష్మణాచారి, నల్లగొండ సదాశివాచారి, సిర్పూర్ నియోజకవర్గకన్వీనర్ నర్సింగోజు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా, రిటర్నింగ్ అధికారిగా ఉప్పుల నర్సింహచారి వ్యవహరించారు. కార్యక్రమంలో సభ్యులు గన్నవరం శ్రీనివాస్, కాగితోజు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: కాగజ్‌నగర్ మండలంలోని కడంబ-గన్నారం రోడ్డుపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. కాగజ్‌నగర్‌వైపు నుంచి చింతలమానేపల్లి వైపు బైక్‌పైవెళుతున్న యువకులను ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న చింతలమానేపల్లి మండలంలోని గంగాపూర్‌కు చెందిన శ్రీనివాస్, రవీంద్రనగర్‌కుచెందిన తపన్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగినపుడు అదే మార్గంలో వెళుతున్న టాస్క్‌ఫోర్స్ సీఐరాణాప్రతాప్, సిబ్బంది గమనించి వెంటనే వారిని కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై తెలిపారు.

మండలాల్లో సావిత్రిబాయి ఫూలే వర్ధంతి



కాగజ్‌నగర్‌లో సావిత్రిబాయి ఫూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



చింతలమానేపల్లిలో మాలి సంఘం నాయకుల నివాళులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 10: సావిత్రి బాయి ఫూలే వర్ధంతిని కాగజ్‌నగర్‌లో పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. కోసిని గ్రామంలో సావిత్రిబాయి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లాఅధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు సావిత్రి బాయి ఫూలే సేవలను కొనియాడారు. ఆమె ఆశయాల కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పిల్లల తిరుపతి, మాలి సంక్షేమసంఘం నాయకులు గొత్రే గోపాల్, గోపి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. ఆలాగే తెలంగాణ ఆల్ సిటిజన్స్ సంఘం, మాలమహానాడు ఆధ్వర్యంలో మార సత్యనారాయణ, కలికోట రమణయ్య, నర్సయ్య, వెంకటేశ్, మొగిలి, శ్రీనివాస్ తదితరులు సావిత్రి బాయి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కౌటాల: మండలకేంద్రంలోని మాలిసంఘ భవనంలో నాయకులు సావిత్రిమాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం సావిత్రిబాయిఫూలే జయంతిని అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలిసంఘంనాయకులు వసంత్‌రావు, గంగారాం, చందు, ప్రసాద్, పాండురంగ్, నారాయణ, మధుకర్, వెంకటి, వంకర్, భీంరావు, సంగీత్‌రావు, వెంకట్, ధర్మ, రాజు, నిరీక్షన్, ఆశీర్వాదం, నితిన్, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని డబ్బా, బారెగూడ గ్రామాల్లో ఆదివారం సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాలిసంఘం నాయకుడు బాపురావు మాట్లాడుతూ మాలికులస్తులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయకులు పాల్గొన్నారు.

వాంకిడి: సావిత్రిబాయి ఫూలే వర్ధంతిని ఆదివారం మండలంలోని ఖిరిడి గ్రామంలో మాలి కులస్తులు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మహిళాఅభివృద్ధి కోసం ఆమెచేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాజ్‌ఉమార్, మాలిసంఘం నాయకులు హనుమంతు, వాసు, మెంగాజీ, సాగర్, వసంత్ రావు, మారుతి, ఓమాజీ, కమలాకర్, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలకేంద్రంలో మాలిసంఘ కార్యాలయంలో సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తులసీరాం, శ్యాంరావు, నారాయణ, తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.



వాంకిడిలో మాలి సంఘం నాయకుల నివాళులు



కెరమెరిలో మాలి సంఘం నాయకుల నివాళులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆసిఫాబాద్, మార్చి 10: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లాఅధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. జిల్లాకేంద్రంలో కార్మికసంఘ భవనంలో ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుకు దూసుకు పోతున్నారని ఇది ఎంతో సంతోషకరమన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మహిళాకార్మికులు ఎన్నోరకాల ఇబ్బందులు పడుతున్నారని వారిసమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాజేందర్, కమలాకర్, అశోక్, నరేష్, సుభాష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా కార్మికులను సన్మానిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎదగాలి



బహుమతులు అందజేస్తున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్, సీఐ శ్రీనివాస్

వాంకిడి, మార్చి 10: క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని జడ్పీటీసీ అజయ్‌కుమార్, సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన డబ్ల్యుపీఎల్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి పాలైన వారు నిరుత్సాహపడకుండా మరోసారి గెలుపుకోసం ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదిగేలా కృషిచేయాలన్నారు. మండలంలో పదిహేను రోజుల నుంచి డబ్ల్యుపీఎల్ క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో స్నేహసంబంధాలు పెరిగి యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండడానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా తమవంతు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడుతూ జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎస్ఎస్ స్ట్రైకర్స్‌జట్టుకు మొదటి బహుమతిగా రూ.50వేలు, షీల్డు, రైజింగ్‌స్టార్స్ జట్టుకు రెండవ బహుమతిగా రూ.25వేలు, షీల్డు అందజేశారు. ఈటోర్నీలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను ప్రత్యేకబహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాంకిడి, సరండి మాజీసర్పంచులు బండె తుకారం, దుర్గం కమలాకర్, బంబార మాజీఎంపీటీసీ వినోద్, క్రికెట్ పోటీల స్పాన్సర్స్ రామగిరి శ్రావణ్, వడ్డెపల్లిసతీష్, ఆశోక్, చాంద్‌పాషా, షఫిక్, శివ, శ్రీకాంత్, ఎంగలి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

బెజ్జూరు, మార్చి 10: మండలకేంద్రంలోని అంబగట్ గ్రామానికిచెందిన బీఆర్ఎస్‌నాయకుడు సంతర్ ఆదివారం కాంగ్రెస్‌నాయకుడు శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. హకీం, నందారం తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీపీపీలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి

జైపూర్, మార్చి 10: జైపూర్ ఎస్టీపీపీలో చిన్న పిల్లల ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే భావితరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని వైద్యులు రుద్రబట్ల రఘువంశీ, అవని చిల్డ్రన్ ఆసుపత్రి డాక్టర్ ఎం విజయ్‌కుమార్ వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. డాక్టర్ రఘువంశీ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18సంవత్సరాలలోపు పిల్లలకు ఏ విధమైన ఆరోగ్య సమస్యలున్నా తాము వైద్యం అందజేస్తామన్నారు. వైద్య శిబిరంలో 60మంది పిల్లలకు వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. పిల్లల వ్యాధులను బట్టి మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు భవానీ బసివిరెడ్డి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేష్ పర్మార్, ఎస్ఓటూ జీఎం వెంకటయ్య, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, డాక్టర్ కె రవీందర్‌వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు బాసటగా ఉండాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిటౌన్, మార్చి 10: గనులు డిపార్టుమెంట్లలో అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడే కార్మికులకు బాసటగా ఉండాలని సింగరేణి గుర్తింపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిగితా యూనియన్‌లకు ఏఐటీయూసీకీ చాలా తేడాఉందని కార్మికులు గుర్తించాలన్నారు. గతగుర్తింపు యూనియన్‌లు అవినీతికి పాల్పడడం, వారికి నచ్చిన వారికే సర్ఫేస్‌లు, డిప్యూటేషన్‌లు ఇవ్వడం వల్ల కార్మికులు ఆ సంఘాలను కాదని ఏఐటీయూసీని ఎన్నుకున్నారన్నారు. నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా నాయకులు, కార్యకర్తలు కార్మికుల హక్కులకోసం పనిచేయాలన్నారు. తప్పుచేస్తే ఎంతటి నాయకున్ని అయినా నిలదీయాలన్నారు. అప్పుడే నాయకులకు ఎలాంటి తప్పు చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. కార్మికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, సోంశెట్టి రాజేశం, మల్లయ్య, సంతు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళలకు వైద్యశిబిరం

శ్రీరాంపూర్, మార్చి 10: సింగరేణీయుల కుటుంబాలకు చెందిన మహిళలకు శ్రీరాం పూర్ ప్రగతి మైదానంలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి స్పెషలిస్టు వైద్యుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, క్యాన్సర్, గర్భకోశ, కిడ్నీవ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేస్తారని, మహిళలు తప్పనిసరిగా హాజరై వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం





ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటూ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ముందుకు సాగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం 21శాతం ఫిట్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు పార్టీ నాయకులు ఆర్టీసీ కార్మికులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ఫ్రెండ్లీ ప్రభుత్వంగా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తరువాత ఆర్టీసీ వినియోగించుకునే వారి సంఖ్య పెరిగిందన్నారు. వారందరికీ నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వందరోజుల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేసిందని ఇది ఒక చారిత్రాత్మక విజయమన్నారు. గత పాలకులు ఆర్టీసీని పట్టించుకోలేదని 40మంది కార్మికుల చావుకు కారణమయ్యారని అన్నారు. జాతీయసమగ్రతకు ఆర్టీసీ ఎంతగానో కృషి చేస్తుందని సొసైటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంగ, చరణ్, ఆసిఫ్, మురళీ, మునీర్, దత్తు, రాంచందర్, శశి, మల్లికార్జున్, మారుతి, శంకర్, దివాకర్, లోకేష్, శ్రీనివాస్, హనుమంతు, రవి, నరేష్, ఆర్పీ సింగ్, వెంకటేశ్వర్, ముజాఫర్‌హుస్సేన్, సత్యనారాయణ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులతో కలిసి కాగజ్‌నగర్ బస్‌స్టేషన్‌లో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వార్ల తిరుపతి, ఎమ్మాజీ సంతోష్ మాట్లాడుతూ ఫిట్‌మెంట్‌తో రాష్ట్రవ్యాప్తంగా 53వేల మంది ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు 12వేల మేర పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, అథర్, రమేష్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే..!

బెజ్జూరు, మార్చి 10: బెజ్జూరు- కుకుడ గ్రామాల మధ్య వాగుపై ఏర్పాటు చేసిన వంతెనపై రెండుస్లాబుల మధ్యవేసిన బీటీ పూర్తిగా పోవడంతో ఖాళీఏర్పడింది. దీంతో వంతెనపై వెళ్లే ద్విచక్రవాహన దారులు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెనపై బీటీపోయిన చోట మరమ్మతులు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.



వంతెనపై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బాపు

ఏసీసీ, మార్చి 10: మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పాత మంచిర్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్‌నాయకుడు నాడెం బాపును నియమిస్తూ డీసీసీఅధ్యక్షురాలు సురేఖ ఆదివారం ఉత్తర్వులుజారీ చేశారు.

ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

మందమర్రిరూరల్, మార్చి 10: అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న టిప్పర్‌ను ఆదివారం అందుగులపేట వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐరాజశేఖర్ తెలిపారు. టీఎస్21టి9992 టిప్పర్‌ను తనిఖీ చేయగా డ్రైవర్ పొంతనలేని సమాధానాలు చెప్పాడన్నారు. అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇసుకను రెబ్బెన నుంచి జగిత్యాలకు తరలిస్తున్నట్లు డ్రైవర్ విజయ్‌గౌడ్ తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

తాండూర్, మార్చి 10: మండలంలోని ద్వారకపూర్ గ్రామంలో రూ.3 లక్షలు, తాండూర్‌లోని సుభద్ర కాలనీలో రూ.2.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టామన్నారు. ఎంపీటీసీ సిరంగి శంకర్, మాసాడి తిరుపతి, జుబేర్, శ్రీధర్, విష్ణు కళ్యాణ్, ఆయూబ్, మహేందర్, ఆదంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

నెన్నెల, మార్చి 10: మండల కేంద్రంలోని కుశ్నపల్లి ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం మాజీ సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారు, బ్యాంకు కస్టమర్ల దాహార్తి తీర్చేందుకు సొంత ఖర్చులతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చల్లని ప్యూరీఫైడ్ వాటర్ అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు చెన్నోజు శంకరయ్య, రణవీర్‌సింగ్, గట్టు బానేష్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కంపెల రమేష్, మోహీద్‌ఖాన్, సాంబమూర్తిగౌడ్ పాల్గొన్నారు.

నేడు అప్రెంటీస్‌షిప్ మేళా

ఏసీసీ, మార్చి 10: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో సోమవారం అప్రెంటీస్‌షిప్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ మేళాకు అర్హులన్నారు. హైద్రాబాద్‌కు చెందిన టిండర్ ఎల క్రిక్ ఇండియా కంపెనీ, టాటా అడ్వాన్సు సిస్టం కంపెనీ, కరీంనగర్‌లోని ఆదర్శ ఆటోమొబైల్స్, మంచిర్యాలలోని ఆర్ఆర్ కన్‌స్రక్షన్స్ కంపెనీల్లో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్,కోపా,మెషనిస్టు డీజిల్‌మెకానిక్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, పెయింటర్‌విభాగాల్లో అప్రెంటీస్‌షిప్ ఖాళీలను భర్తీచేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.9వేల నుంచి 11వేల వరకు స్టైఫండ్, ఉచిత రవాణా, క్యాంటీన్‌సౌకర్యం ఉంటుందన్నారు. ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి, మార్చి 10: మండలంలోని లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన ఈర్ల సతీష్-మౌనిక దంపతుల కుమారుడు అభిజిత్ అనే బాలుడు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.10లక్షల అవసరం కాగా విషయం తెలుసుకున్న దండేపల్లి మండల మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బాధితుడి కుటుంబసభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయంను అందజేశారు. కార్యక్రమంలో మున్నూర్ కాపుసంఘం మండలఅధ్యక్షకార్యదర్శి బొలిశెట్టి రాజన్న, పోలంపల్లిశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అప్పాల మనోహర్, కోశాధికారి కుంచె కిషన్, జాబు సుగుణాకర్, బొలిశెట్టి బుచ్చన్న, కొళ్లెం రాజు నల్లెల సంతోష్, రామరాజు, కోండు రామన్న, మత్తినేని రమేష్ పాల్గొన్నారు.

14న ఉచిత వైద్య శిబిరం

భీమిని, మార్చి 10: మండలంలోని మామిడిపల్లి రోడ్డులోని ధనుంజయ ప్రాథమికఆరోగ్యకేంద్రంలో మంచిర్యాలకుచెందిన అవని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 14న ఉచితవైద్యశిబిరం నిర్వహిస్తామని ఆరోగ్యకేంద్రం నిర్వాహకుడు ధనుంజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోనిగ్రామాలప్రజలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ


లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.



తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందరి రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఎల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే 31వేల ఉద్యోగాలిచ్చాం

- మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి
- మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ
- జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామనిమంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్నంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామ సభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్లు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.


సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయి ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పులు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్‌ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



అయ్యప్ప ధర్మ ప్రచార సభ కమిటీ ఎన్నిక

ఏసీసీ, మార్చి 10: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడుగా నర్సింహారావు, అధ్యక్షుడిగా చుంచు రాజ్‌కిరణ్, ఉపాధ్యక్షులుగా రవీందర్, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజేశం, సంయుక్త కార్యదర్శిగా కుమారస్వామి, కోశాధికారిగా లచ్చన్న, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణరావులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష



బెల్లంపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 10: ఆదిలాబాద్ రీజియన్‌లోని బెల్లంపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లలోని 3 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆదిలాబాద్ రీజియన్ సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో కొప్పుల స్వరూపరాణి తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 227 మందికిగాను 215 మంది హాజరు కాగా, ఇంటర్మీడియట్‌లో 231 మందికి 216 మంది హాజరైనట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. బెల్లంపల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్‌సీవో స్వరూపరాణి బెల్లంపల్లి పరీక్ష కేంద్రాన్ని గురుకుల ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో కలిసి పరిశీలించారు.

మైదానంలోని సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, మార్చి 10: పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో అనేక సమస్యలున్నాయని, వాకింగ్ ట్రాకింగ్ లేక వాకర్లు ఇబ్బందులు పడుతున్నారని వాకర్స్ అసోసియేషన్ నాయకులు దుర్గం ప్రభాకర్, ఓ. రాజశేఖర్, శేఖర్‌లు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగాయని, పాములు సంచరిస్తున్నాయన్నారు. ఉదయం 5 గంటలకు భయం భయంగా వాకింగ్ చేస్తున్నారన్నారు. గ్రౌండ్‌లో ఎత్తు పల్లాలు ఉండడంతో వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడలు ఆడడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు పడిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని మందమర్రి జీఎంకు వినతిపత్రం అందించామన్నారు గురుప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం వాకర్ అసోసియేషన్ నాయకులు, వాకర్స్ శ్రమదానం చేపట్టారు. వాకింగ్‌ట్రాక్ చుట్టూ ఉన్న గడ్డిని, చెట్ల కొమ్మలను తొలగించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నిక



ఎన్నికైన మహేందర్, మధుసూదన్‌రావులను సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 10: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చందూరి మహేందర్‌ను, సొసైటీ స్టేట్ ఎంసీ మెంబర్‌గా మధుసూదన్‌రెడ్డిని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు. సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, కిషన్, సత్యనారాయణరెడ్డి, శరత్‌కుమార్, హరీష్ చంద్రమోహన్‌గౌడ్, శంకర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్‌లు పంపిణీ

మందమర్రిటౌన్, మార్చి 10: పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, కాంట్రాక్టర్ దుర్గం ప్రభాకర్ క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందజేశాడు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రికెట్ కిట్‌లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలుపడంతో అందించినట్లు తెలిపారు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు.

వేలాల జాతర హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ డబ్బును లెక్కిస్తున్న మహిళలు

జైపూర్, మార్చి 10: మహాశివరాత్రిని పురస్కరించుకుని వేలాల గుట్టపై వెలిసిన గట్టు మల్లన్న జాతర హుండీ ఆదాయాన్ని ఆదివారం ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్, ఈవో రమేష్‌ల ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం రూ. 11,27,199. లడ్డు ప్రసాదం ద్వారా రూ.75 వేలు, కొబ్బరికాయల ద్వారా ద్వారా రూ. 10 వేలు, పట్నాల ద్వారా రూ.97,700, స్పెషల్ దర్శనం ద్వారా రూ.4,14,800, తలనీలాల ద్వారా రూ.21,600 ఆదాయం వచ్చిందన్నారు. మొత్తం నికర ఆదాయం రూ.18,45,799 వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి రూ. 46,605 ఆదాయం ఎక్కువగా వచ్చిందని తెలిపారు.

మల్లికార్జున స్వామి హుండీల ఆదాయం

మహాశివరాత్రిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు జరిగిన జాతర మల్లికార్జున స్వామి ఆదాయాన్ని ఆదివారం ఈవో రమేష్ ఆధ్వర్యంలో లెక్కించారు. లడ్డు ప్రసాదం ద్వారా రూ.3.78 లక్షలు, కొబ్బరిముక్కల ద్వారా రూ.20 వేలు, పట్నాల ద్వారా రూ. 8,24,150, సులభ దర్శనం ద్వారా రూ.5.28 లక్షలు, స్పెషల్ దర్శనం ద్వారా రూ.3.25,450, తలనీలాల ద్వారా రూ.20 వేలు, హుండీ ద్వారా రూ. 19,32,456 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. మొత్తం రూ. 35,28,056 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలాల జాతరలో భాగంగా గుట్టపైన, గుట్ట కింద జరిగిన జాతరలో మొత్తం రూ.53,73,855 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. మిక్స్‌డ్ గోల్డ్ 592 గ్రాములు, వెండి 816 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ఏసీసీ, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎనగందుల రమాదేవి, గైనకాలజిస్టు డాక్టర్ మౌనిక, బీజేపీ జిల్లా మహిళ ఇన్‌చార్జి లావణ్య, మైత్రి యోగా ప్రకృతి చికిత్స సెంటర్ నిర్వాహకులు డాక్టర్ సమీరలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి డాక్టర్ చంద్రకళ బహుమతులు అందించారు.

పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలన్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు.

నెరవేరనున్న కల



కాజువే వంతెన కూలిన చోట బోల్తాపడ్డ లారీ (ఫైల్)

- రాళ్లవాగుపై హై లెవల్ వంతెనకు మోక్షం
- రూ.13.50 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయింపు
- బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే
- తీరనున్న రంగంపేట వాసుల కష్టాలు

మంచిర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాళ్లవాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఉన్న కాజువే బ్రిడ్జి స్థానంలో వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆది వారం భూమిపూజ చేశారు. దీంతో ఇంతకాలం ఇబ్బందులు పడుతున్న రంగంపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళమ్మ కాలనీల ప్రజల కష్టాలు తీరేందుకు మార్గం సుగమమైంది.

● రూ. 80 లక్షలతో కాజువే నిర్మాణం

పట్టణంలోని లక్ష్మీటాకీస్ ప్రాంతాన్ని, పాత మంచిర్యాల సమీపంలోని రంగంపేటను కలిపేందుకు 2005లో సుమారు రూ.80 లక్షల అంచనా వ్యయంతో రాళ్లవాగుపై పైపులతో కూడిన కాజువే వంతెన నిర్మించారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమరుల స్థూపం నుంచి వంతెన మీదుగా ప్రజలు ఆయా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తారు. అంతకు ముందు వంతెన లేని సమయంలో ఆ ప్రాంత ప్రజలు పట్టణానికి రావాలంటే పాత మంచిర్యాల లేదా అండాళమ్మ కాలనీ మీదుగా ఎంసీసీ క్వారీ రోడ్డులో ఐదారు కిలోమీటర్లు ప్రయాణించేవారు. దీంతో ప్రజలకు దూర భారం పెరగడంతోపాటు అధిక వ్యయప్రయా సలకు గురయ్యేవారు. వంతెన నిర్మాణం తరువాత కేవలం అర కిలోమీటర్ ప్రయాణించి పట్టణానికి చేరుకుంటున్నారు. పాలు విక్రయిస్తూ జీవనం సాగించే రంగంపేట ప్రజలు ఈ వంతెన గుండానే ప్రయాణిస్తారు. అలాగే పాఠశాలలు నడిచే సమయంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రాళ్లపేట, బైపాస్ రోడ్డు ప్రాంతంలోని ప్రజలు ఇప్పటికీ కాజువే వంతెన గుండానే ప్రయాణిస్తూ పాత మంచిర్యాల మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తారు. ప్రస్తుతం వంతెన కూలిపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● కుప్పకూలిన కాజువే

రాళ్లవాగుపై తాత్కాలికంగా నిర్మించిన కాజువే 2019లో కురిసిన భారీ వర్షాల కారణంగా కుప్పకూలిపోయింది. దాదాపు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదు. కూలిన చోట తాత్కాలికంగా మట్టిపోసి రాకపో కలను పునరుద్ధరించేవారు. దీంతో యేటా వర్షాకాలంలో రాళ్లవాగు ఉప్పొంగినప్పుడల్లా వంతెన నీట మునిగి మట్టి కొట్టుకుపోవడం, తరువాత మళ్లీ తాత్కాలిక చర్యలు చేపట్టడం ఆనవాయితీగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు కాజువేపై రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు గురయ్యేవారు. కాజువే వంతెన నిర్మాణానికి ముందు అదే ప్రాంతంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదన ఉండేది. అయితే 2005కు పూర్వం ఆ ప్రాంతం అభివృద్ధి చెందకపోవడంతో అప్ప టి పాలకులు కాజువే వంతెనతో సరిపెట్టారు. కాలక్రమంలో రంగంపేట ప్రాంతం అభివృద్ధి చెందడం, సమీపంలో కొత్త కాలనీలు ఏర్పాటు కావ డంతో ప్రజల సౌకర్యార్థం హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతి పాదనలు తెరమీదికి వచ్చాయి. పాలకులు సైతం హై లెవల్ బ్రిడ్జి ఆవశ్యకతపై అనేక సార్లు ప్రస్తావనకు తెచ్చారు. అయితే దశాబ్దాలు గడిచినా వంతెన నిర్మాణం కేవలం ప్రతిపాదనలకే పరిమితం అయిందిగానీ ఆచరణలోకి రాలేదు.

● రూ. 13.50 కోట్లతో వంతెనకు శ్రీకారం

ప్రజల విన్నపాల మేరకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక శ్రద్ధతో కాజువే స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ. 13.50 కోట్లతో హై లెవల్ వంతెన నిర్మాణానికి భూమిపూజ చేయడంతో ఎట్టకేలకు మోక్షం లభించినట్లయింది. హై లెవల్ వంతెన నిర్మాణంతో పాత మంచిర్యాల, రంగంపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళమ్మకాలనీ ప్రజలకు రాకపోకలు సులభతరం కానుంది. తెలంగాణ అమరవీరుల స్థూపం మొదలుకొని వాగు అవతలివైపు సుమారు 200 మీటర్ల పొడవుతో వంతెన నిర్మాణం జరుగనుంది. వంతెనకు నిధులు కేటాయించి, భూమిపూజ కూడా చేసినందున ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వంతెనకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

అభివృద్ధిలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఏసీసీ, మార్చి 10: అభివృద్ధిలో రాష్ట్రంలోనే మంచిర్యాలను మొదటి స్థానంలో నిలుపుతామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం సాయికుంటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయికుంటలో రూ.48.50 కోట్లతో అమృత్ నీటి సరఫరా పైపులైన్, ట్యాంకు, రాళ్లపేటలో రూ.13.5 కోట్లతో రాళ్లవాగుపై హైలెవల్ వంతెన, రూ.5.67 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ మహేష్, కమిషనర్ మారుతిప్రసాద్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. 20వ వార్డు సీతారాంపల్లిలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ అమృత్ నీటి సరఫరా పైపులైను, ట్యాంక్ నిర్మాణానికి రూ.73 కోట్లు, సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4.03కోట్లు విడుదల చేయించానన్నారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు, వైస్‌చైర్మన్ గెల్లు రజిత, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, ఆర్‌ఓ కె. సతీష్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఏఈలు మధు, సుబ్బారావు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.22 కోట్లతో అమృత్ నీటి సరఫరా పైపులైన్, ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం 15వ వార్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజచేశారు. ఉన్నత పాఠశాలకు రూ.2.38 కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, కమిషనర్ రాజశేఖర్, డీసీసీ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ, మండలాధ్యక్షుడు ఆరీఫ్, రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం వద్ద రూ.1కోటి 59లక్షలతో నిర్మించే భవనానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిన్నీ అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10లక్షల వరకు వైద్య సదుపాయం ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, నాయకులు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శు వెంకటేశ్వర్లు, సతీష్, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ రెఫరీగా కళ్యాణ్



ఏసీసీ, మార్చి 10 : సీనియర్ మహిళల 52వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కోటపల్లి మండలానికి చెందిన ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న జుమ్మిడి కళ్యాణ్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేష్‌లు ఆదివారం తెలిపారు. హెచ్ఎఫ్ఐ జాతీయస్థాయి రెఫరీగా కూడా అర్హత సాధించినట్లు తెలిపారు. కళ్యాణ్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్, అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రజితలు అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



వైష్ణవి



శిరీష

జాతీయ స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వైష్ణవి, శిరీషలు ఎంపికైనట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాం సుందర్‌రావు, కనపర్తి రమేష్‌లు ఒక ప్రకటనలో తెలి పారు. ఈ నెల 16 నుంచి 20 వరకు దాద్రానగర్ హవేలి పట్టణంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

కరాటే పోటీలు

రామకృష్ణాపూర్, మార్చి 10: పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో ఆదివారం విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి తవక్కల్ పాఠశాల అధినేత అబ్దుల్ అజీజ్, ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ కరాటేను ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలన్నారు. కరాటే ఆడపిల్లలకు ఎంతో అవసరమన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్దని రైతుల రాస్తారోకో



లక్ష్మీపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

లక్షెట్టిపేటరూరల్, మార్చి 10: ఫోర్‌లైన్ గ్రీన్ ఫీల్డ్ హైవే వద్దని రైతులు రోడ్డెక్కారు. మండలం సూరారం గ్రామం 63వ జాతీయ రహదారిపై ఆదివారం రైతులు రాస్తారోకో చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ కోసం అధికారులు భూ సర్వే చేసేందుకు వస్తున్నారనే సమాచారంతో రాస్తారోకో చేశామన్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయి నష్టపోయామన్నారు. మళ్లీ భూములు కోల్పోమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేసిన సర్వే ప్రకారం పాత హైవే రోడ్డునే నిర్మించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయి రైతులకు నష్టం జరిగే హైవే రోడ్డు విస్తరణ పనులు జరగకుం డా అడ్డుకుంటామన్నారు. న్యాయం జరిగే వరకు బాధిత రైతులందరం పోరాడుతామని స్పష్టం చేశారు. సుమారు 3 గంటలపాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. లక్షెట్టిపేట, ఇటిక్యాల, మోదెల, పోతపల్లి, సూరారం, గుల్లకోట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామకృష్ణాపూర్, మార్చి 10: పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు క్షేమ సమాచారాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఆడెపు కృష్ణకుమార్, ఉప్పరి చంద్రమౌళి, గాదె శ్రీనివాస్, కుదిరె రామస్వామి, చంద్రగిరి వెంకటస్వామి, జక్కనబోయని కుమారస్వామి, కంది మహేందర్, కత్తి రాజబాబు, పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం

రామకృష్ణాపూర్, మార్చి 10: పట్టణంలోని ప్రసన్నాం జనేయ మహాంకాళి దేవాలయంలో చండీయాగం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వేద పండితులు ముస్తాల సంతోష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి



పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వాకర్లు

మందమర్రిటౌన్, మార్చి 10: సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం దళిత, బీసీ సంఘాల నాయకులు ఆదివారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద, మార్కెట్ సెంటర్‌లో పూలే చిత్రపటానికి రచయిత, కవి, గాయకుడు సుందిల్ల రాజయ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చందర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా వ్యాప్తికి, సమాజ శ్రేయస్సుకు పూలే చేసిన సేవలను కొనియాడారు. మొయ్య రాంబాబు, కనకం రవి, నర్సింహులు, రాజయ్య, శంకర్, హుస్సేన్, ఓదెలు పాల్గొన్నారు. పాత బస్టాండ్ ఏరియాలోని పద్మశాలి భవన్‌లో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, వెంకటేశ్వర్‌గౌడ్, వెంకటయ్య, పాల్గొన్నారు.

వేమనపల్లి: సుంపుటంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని కేవీపీఎస్ నాయకులు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దూర్కె మోహన్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేశం, మాజీ సర్పంచు బాపు, నాయకులు సంజీవ్,వెంకటేష్, గోపాల్, శేఖర్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. మహిళల విద్యావ్యాప్తికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు.

కాసిపేట: దేవాపూర్, కాసిపేట, సోమగూడెం, ముత్యంపల్లి కేఎం పీఎల్ మైదానంలో సావిత్రిబాయిపూలే వర్ధంతి వేడుకలను దళిత, బహుజన సంఘాల నాయకులు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: రంగపేట అంబేద్కర్ వారసుల కాలనీలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిప్పకుర్తి నారాయణ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేందర్, సలీం, సతీష్, మనోహర్‌ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: జజ్జరవెల్లిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి మాలి సంఘం నాయకులు నిర్వహించారు.